# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 10 సెప్టెంబర్ – 2025 పేజీలు: 24









# ఉపాధ్యాయుల ఉద్యమస్ఫూర్తి

ప్రభుత్వ బడుల్లో తమ పిల్లల్ని చేర్పిస్తున్న టీచర్లు



# 'మెగా పిటిఎం' కు గిన్నిస్ వరల్డ్ రికార్డు







# మన బడి

## మాస పత్రిక



సంపుటి: 1 సంచిక: 10 సెప్టెంబర్ – 2025 పేజీలు: 24

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య

**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా

**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య**, డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD –1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD –2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO

**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్

**సబ్ ఎడిటర్**
**గణేశ్ బెహరా,** PRO

**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ.సుహాసిని**, సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె. పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)

**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**

**చిత్రకారులు**
**మల్లిక్**

## ప్రభుత్వ బడికి ఉపాధ్యాయుల భరోసా

*ఎవరో ఒకరు... ఎపుడో అపుడు.. ఎవరో ఒకరు ఎపుడో అపుడు*
*నడవరా ముందుగా... అటో ఇటో ఎటో వైపు అటో ఇటో ఎటో వైపు..*
*అ... అ... అ... అ... అ.... మొదటివాడు ఎప్పుడు ఒక్కడే మరి మొదటి అడుగు ఎప్పుడు ఒంటరే మరి వెనుక వచ్చు వాళ్ళకు బాట అయినది... 'అంకురం' చిత్రంలో సిరివెన్నెల కలం నుంచి జాలువారిన పలుకులకు అక్షర సత్యాలు ఇవీ..*

కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలల పట్ల చిన్నచూపు చూసే ధోరణిని తిప్పికొట్టే ఒక గొప్ప మార్పు మొదలైంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి సరికొత్త చరిత్రకు నాంది పలికారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాల్లో ఒకటి. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు బడుల్లో చదివించడమే. "పాఠాలు చెప్పే గురువుకే తన బడిపై నమ్మకం లేదా?" అనే ప్రశ్న సామాన్య తల్లిదండ్రుల నుంచి వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో, కొందరు ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడం ద్వారా ఆ ప్రశ్నకు తమ ఆచరణతో సమాధానం చెబుతున్నారు.

ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు సైతం తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలతో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య అందుబాటులో ఉంది. అందరికీ నాణ్యమైన, ఉచిత విద్యను అందించే ప్రభుత్వ లక్ష్యానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతోంది.

వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక శ్రేయస్సును, వృత్తి ధర్మాన్ని గౌరవించిన ఈ ఆదర్శ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు. ఈ స్ఫూర్తిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు అందిపుచ్చుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనం కేవలం ప్రభుత్వ పథకాలతోనే కాదు, ఉపాధ్యాయుల ఆచరణాత్మకమైన నిబద్ధతతోనే సాధ్యమవుతుంది.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/ samagrashiksha/ మరియు cse.ap.gov.in

# చిన్నారి ఆరాధ్య.. చిచ్చరపిడుగు..

## మైండ్ మ్యాపింగ్ లో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు


హాయ్ ఫ్రెండ్స్.. ఈరోజు మీ అందరికీ స్ఫూర్తినిచ్చే కథతో మీ ముందుకు వచ్చాను..

ఈ చిన్నారి పేరు ఆరాధ్య బెహరా... అనకాపల్లి జిల్లా బాపాడుపాలెం ఎం.పి.పి స్కూల్లో ఒకటో తరగతి చదువుతోంది. ఆరాధ్య గురించి చెప్తే ఆశ్చర్యపోతారు తెలుసా!

వయసు ఐదేళ్లే.. కానీ అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది..

అదేంటో తెలుసుకుందామా...ఒక్కసారి చూస్తే మైండ్ లో ప్రింట్ అయిపోద్ది.....


ఆరాధ్య స్కూల్లో చాలా యాక్టివ్ గా ఉంటుంది, తరగతి గదిలో పాఠాలు బట్టీ పట్టి చదవడం కంటే, ఆటల ఆధారంగా చదవడం అంటే తనకి చాలా ఇష్టం. సింగిల్ టీచర్ కొరుపోలు గంగాధర్ మాష్టారు గైడెన్స్ తో పాఠాలు చాలా చురుగ్గా నేర్చుకుంటుంది. ఆరాధ్య ఒక్కసారి చూసిందంటే గుర్తుండిపోతుంది. అది గమనించిన టీచర్ గంగాధర్ కి ఒక ఐడియా తట్టింది. వెంటనే, A- Z లెటర్స్ ను కార్డ్ బోర్డ్ షీట్ల మీద 26 తయారుచేసి, క్రమం లేకుండా పెట్టారు, ఆరాధ్యకు ఒకసారి చూపించి, గమనించమని చెప్పి, ఆ తరువాత, A- Z ఇంగ్లీష్ వర్ణమాలని వెనక్కి తిరగేసి పెట్టేసారు.. అప్పుడు ఆరాధ్య.... ఎటువంటి సహాయం లేకుండా తన జ్ఞాపకశక్తిని మాత్రమే ఉపయోగించి, A- Z ఇంగ్లీష్ అక్షరమాల 1.30 సెకన్ల లోపే గుర్తించి, క్రమంలో చెప్పింది.. ఇదే మైండ్ మ్యాపింగ్ యాక్టివిటీ. ఇంగ్లీష్ అక్షరమాలతో పాటు, ఇటు మ్యాథమెటిక్స్ లో క్రమం లేకుండా ఉన్న అంకెలను కూడా ఒక్కసారి ఆరాధ్యకి చూపించి, గమనించమని చెప్పి, వాటిని వెనక్కి తిరగేసి పెట్టిన తరువాత, సెకన్ల లోనే అంకెలను గుర్తించి క్రమంలో చెప్పేస్తుంది. మన ఆరాధ్య...



ఒక్కసారి చూస్తే అలా మైండ్ లో ప్రింట్ అయిపోద్దన్నమాట... ఇది చాలా అరుదైన కళ అని ఆరాధ్య ను గైడ్ చేస్తున్న సింగిల్ టీచర్ కొరుపోలు గంగాధర్ చెప్పారు.

ఈ చిన్నారి సృజనను, మాష్టారి కృషిని అభినందిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు ట్వీట్ ద్వారా అభినందించారు.

– **అమలాపురపు దుర్గాప్రసాద్**, జర్నలిస్ట్



Lokesh Nara @naralokesh · 1h
#Anakapalle
#InspiringTeachers
#EducationForAll
#GovernmentSchools
అనకాపల్లి జిల్లా, MPP స్కూల్ బాపాడుపాలెం పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న చిట్టి ఆరాధ్య, తన సృజనాత్మకతతో ప్రదర్శించిన మైండ్ మ్యాపింగ్ మైండ్ బ్లోయింగ్. చిన్నారి ఆరాధ్యకు ఆశీస్సులు. చిన్నారిని చిచ్చరపిడుగులా తీర్చిదిద్దిన బాపాడుపాలెం MPP స్కూల్ ఉపాధ్యాయుడు గంగాధర్ రావు గారికి అభినందనలు. పిల్లల ఆసక్తి, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి ఉపాధ్యాయుల కృషి తోడైతే ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి ఇంకెన్నో అద్భుతాలు సాధించవచ్చు.







# మంత్రి లోకేష్ చొరవతో ఏపీ విద్యకు అదనంగా రూ. 432.19 కోట్లు ఇచ్చిన కేంద్రం

ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యంతో పనిచేస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంకల్పానికి కేంద్రం కూడా మద్దతుగా నిలుస్తోంది. సమగ్రశిక్షకు గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్ల నిధులను కేంద్రం మంజూరు చేసింది.

### ఐసీటీ ల్యాబ్ లు, స్మార్ట్ క్లాసెస్ కు రూ. 167.46 కోట్ల అదనపు నిధులు

సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో విద్యార్థులను బలోపేతం చేయడానికి ఐసిటి (Information and Communication Technology) ల్యాబ్ లు, స్మార్ట్ తరగతులు, సైన్స్ ల్యాబ్స్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం రూ.167.46 కోట్ల అదనపు నిధులను మంజూరు చేసింది. దీంతో పాటు డైట్ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ గా మార్చడానికి గతంలో 50 శాతం మాత్రమే నిధులు రాగా, ఈ ఏడాది రూ. 45 కోట్లకు గానూ 96శాతం అంటే రూ. 43.23 కోట్ల నిధులు మంజూరు చేసింది.

### ఆదివాసీ విద్యార్థులకు వసతి గృహాల కోసం రూ. 11 కోట్లు

గిరిజన తెగల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (DA-JGUA) పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న ఆదివాసీ విద్యార్థుల కోసం 4 వసతి గృహాలను నిర్మించేందుకు కేంద్రం రూ.11 కోట్లు నిధులు మంజూరు చేసింది.


### జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద రూ. 210.5 కోట్లు

ప్రధాన మంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం (PMJANMAN) లో భాగంగా రెండు దశల్లో మొత్తం 79 హాస్టళ్లు నిర్మించేందుకు కేంద్రం రూ.210.5 కోట్ల నిధులు మంజూరు చేసింది.

### మంత్రి లోకేష్ చొరవతో పీఎంశ్రీ కింద అదనంగా 80 పాఠశాలలు ఎంపిక

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (PMSHIRI) పథకం కింద రాష్ట్రంలో మొత్తం 855 పాఠశాలలను ఎంపిక చేయగా.. మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ విద్యా సంవత్సరం అదనంగా మరో 80 పీఎంశ్రీ పాఠశాలలను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా 14,500 పీఎంశ్రీ పాఠశాలలు ఉండగా.. అత్యధికంగా ఏపీకే 935 పీఎంశ్రీ పాఠశాలలను కేటాయించడం జరిగింది.





ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారిని కలిసిన
విద్యాశాఖామంత్రి శ్రీ నారా లోకేష్

# ఉపాధ్యాయుడు - మార్గదర్శకుడు

ముందుగా, ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ఉపాధ్యాయులుగా నియమితులైన మీ అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీరు విజయం సాధించింది కేవలం ఒక ఉద్యోగం మాత్రమే కాదు– మీ భుజాలపై పడింది, తరతరాల భవిష్యత్తు. 'గురువు, గోవిందుడు ఎదురైతే ముందుగా నేను గురువుకే నమస్కరిస్తానంటాడు' కబీర్. దీనిని బట్టి మన సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఇచ్చిన గౌరవం ఎంతో తెలుస్తుంది.

ఈ సందర్భంలో నాకు నేను 1995 జూన్‌లో డీఎస్సీ ద్వారా SGT ఉపాధ్యాయుడిగా నియమించబడిన సందర్భం జ్ఞాపకం వస్తున్నది. అప్పుడు మొదట నియమించబడిన పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు ఉండేవారు. పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాలగా 1 నుంచి 7 తరగతులతో ఉండేది. ఉపాధ్యాయులు మొత్తం ఐదు మంది మాత్రమే.. అయినప్పటికీ 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు పాఠశాలను సమర్థంగా నడిపాము. మండలంలో మా పాఠశాలకు మంచి పేరు ఉండేది. తల్లిదండ్రుల భాగస్వామ్యం, గ్రామస్తుల సహకారం ఉండేది. మనం కష్టపడి, కలసి పనిచేస్తే ఏ పరిస్థితినైనా ఎదుర్కొని పాఠశాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లవచ్చని నేను అప్పుడే గ్రహించాను.

### ప్రస్తుత ప్రభుత్వం చాలా ఉదాత్తంగా Teacher–Pupil Ratioను పాటిస్తోంది.

ప్రతి 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను ఆదర్శపాఠశాలలుగా మార్పుచేశారు. ఈ పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించారు. వీటిని ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ సంకల్పం. తరగతికి ఒక ఉపాధ్యాయుడు, తద్వారా ఫౌండేషన్ లిటరసీ మరియు న్యూమరసీ పెంపొందించే లక్ష్యంతో వీటికి అంకురార్పణ జరిగింది.

ఉన్నత పాఠశాలలో ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేక ఉపాధ్యాయుడు ఉండేలా విధానం రూపొందించారు.

అదనంగా ఉపాధ్యాయుల కోసం శిక్షణలు, సదుపాయాలు, డిజిటల్ వనరులు కూడా అందుబాటులో ఉన్నాయి.

దీని అర్థం స్పష్టంగా ఒకటే – ఇప్పుడు ఉపాధ్యాయులు బోధనపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉంది.

మరి నిరంతరం ఉపాధ్యాయులు చైతన్యంగా ఉంటూ విద్యార్థులను చైతన్యవంతులను చేయాలంటే మీరు ఏమి చేయాలి. ఇందు కోసం ఉపాధ్యాయుడు

1. నిత్య విద్యార్థి కావాలి : నా అనుభవంలో గమనించిన ఒక ముఖ్య లోపం ఏమిటంటే – ఉపాధ్యాయులు డీఎస్సీ రాసేటప్పుడు ఎంతగా చదువుతారో, ఉద్యోగంలో చేరిన తర్వాత అంతగా చదవరు. ఇది ఉపాధ్యాయునికి ఉండకూడని లక్షణం.. 'ఒక గురువు తనను తాను నేర్చుకుంటూనే ఉంటే తప్ప నిజంగా బోధించలేడు' అని రవీంద్రనాథ్ ఠాగూర్ అంటారు. ఒక దీపం తన సొంత జ్వాలను వెలిగించుకోకపోతే అది మరో దీపాన్ని వెలిగించదు. ఉపాధ్యాయులు మొదట మంచి అభ్యాసకులుగా ఉండాలని, వారు నేర్చుకోకపోతే, విద్యార్థులకు బోధించడం అసాధ్యం అని ఆయన నొక్కి చెప్పారు.. నిరంతరం అభ్యాసకుడుగా ఉండడమే ఉపాధ్యాయుని మొదటి లక్షణంగా ఉండాలి.

2. ఏ పాఠం బోధిస్తారో ఆ పాఠ్యాంశాలు పట్ల ముందుగానే పూర్తి ప్రిపరేషన్‌తో ఉండాలి. ఆ యొక్క పాఠ్యాంశం బోధన తర్వాత విద్యార్థులు ఏయే సామర్థ్యాలు నేర్చుకోవాలో ముందే నిర్ణయించుకోవాలి.

3. FLN పై దృష్టి – ప్రాథమిక స్థాయిలో Foundational Literacy and Numeracy లక్ష్యాలను సాధించేందుకు ప్రతిరోజు ప్రణాళికాబద్ధమైన బోధన చేయాలి.

4. విద్యార్థుల ప్రత్యేకతను గుర్తించడం – ప్రతి విద్యార్థి వేరు. వారి సామర్థ్యాలు, నేర్చుకునే పద్ధతులు వేరు. దానికి తగ్గ బోధన అవసరం.

5. తల్లిదండ్రులు – సమాజంతో భాగస్వామ్యం – పాఠశాల అభివృద్ధి, విద్యార్థి పురోగతి కోసం తల్లిదండ్రులతో నిరంతరం చర్చలు జరపాలి. బడి అభివృద్ధిలో సమాజాన్ని భాగస్వామ్యం చేసుకోవాలి.

### మీ భవిష్యత్తు – సమాజ భవిష్యత్తు

రాష్ట్రంలో కొత్తగా 16,000 పైచిలుకు ఉపాధ్యాయులు నియమితులవుతున్నారు. మీ అందరూ కృషితో, క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల గౌరవం మరింత పెరుగుతుంది.


మీ తరగతిలో ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలను సాధించాలి.

ప్రతిరోజు పాఠశాలలో మార్పును మీరు సృష్టించాలి.

విద్యార్థులు మిమ్మల్ని మర్చిపోకూడదు – అదే ఒక గొప్ప ఉపాధ్యాయుడి విజయమని నేను నమ్ముతున్నాను.

చివరగా "ఉపాధ్యాయుడు కేవలం బోధకుడు కాదు – మార్గదర్శకుడు. విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే శక్తి మీలో ఉంది. ఆ శక్తిని సద్వినియోగం చేసుకోండి."

మీ ఉపాధ్యాయ వృత్తిని గర్వంగా భావించి, ఎల్లప్పుడూ నేర్చుకుంటూ, బోధనలో కొత్త ఆవిష్కరణలు చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తును వెలిగించాలని నా హృదయపూర్వక శుభాకాంక్షలు.



– కె. రవీంద్రనాథ్ రెడ్డి,
ఎస్పీడీ –2, సమగ్ర శిక్ష

# ఉపాధ్యాయుల ఉద్యమస్ఫూర్తి

**ప్రభుత్వ బడుల్లో తమ పిల్లల్ని చేర్పిస్తున్న ఉపాధ్యాయులు**

**ప్రజల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం పెంచిన టీచర్లు**

**ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన కూటమి ప్రభుత్వం**

చాలా ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ పిల్లల్ని ఎందుకు ఆ పాఠశాలల్లో చదివించరు? అనే ప్రశ్న చాలా వైపుల నుంచీ వినిపిస్తోంది. దీనికి తొలిసారిగా కొందరు ఉపాధ్యాయులు సమాధానం ఇచ్చారు. మార్పు కావాలనుకునే వారు తమ ఇంటి నుంచే మొదలుపెట్టాలనే కృతనిశ్చయంతో మేము సైతం అంటూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి ప్రజల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం పెంచేందుకు దోహదపడ్డారు.

ప్రస్తుత సమాజంలో పాఠశాల అనేది కేవలం విద్యను బోధించే స్థలం మాత్రమే కాదు, భవిష్యత్తు తరాలకు మానవీయ విలువలు, సామాజిక బాధ్యతలు, సృజనాత్మక ఆలోచనలను అందించే విద్యా వికాస కేంద్రం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బడుల పాత్ర ఎంతో కీలకమైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా రంగంలో చేపడుతున్న ఎన్నో సంస్కరణలు, పాఠశాలల రూపురేఖలను మార్చేసి, కొత్త ఆశలు నింపుతున్నాయి.

నాణ్యమైన విద్య, మౌలిక సౌకర్యాల మెరుగుదల, మధ్యాహ్న భోజన పథకం, అందరికీ సమాన విద్య వంటివన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలవుతున్నాయి. అంతేకాదు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతూ 'ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' దిశగా పయనిస్తోంది ప్రభుత్వం. మరి ప్రభుత్వ పాఠశాలల గురించి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడానికి కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నంద్యాల జిల్లా సిరివెళ్ల ఆదర్శ పాఠశాలలో పీజీటీ (మ్యాథ్స్) గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.షావలి. తన ఇద్దరు పిల్లలను ఆయన బోధిస్తున్న స్కూళ్లోనే చదివిస్తున్నారు.



కూతురు ఎస్.ఇజ్మా ముసార్రాత్ ప్రస్తుతం 9 వ తరగతి. ఇదే పాఠశాలలో 6 వ తరగతి నుండి చదువుతుంది. కొడుకు ఎస్. మహ్మద్ ఫైజ్ 7 వ తరగతి. "నేను కూడా ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే. ప్రస్తుతం మోడల్ స్కూల్స్ చాలా బాగా ఉంటున్నాయి. అత్యుత్తమ ఉపాధ్యాయులు అంకితభావంతో బోధిస్తున్నారు. పిల్లలకు చక్కని విద్యను అందిస్తున్నారు. కాబట్టి అందులో నేను అందరికీ ఆదర్శంగా ఉండాలనుకున్నాను. నా పిల్లలను మా పాఠశాలలోనే చదివిస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలో చదివితే పిల్లలకు స్వతహాగా నేర్చుకోగలిగే నైపుణ్యాలు అలవడతాయి. అందరితో కలిసి చదవాలి షేరింగ్, కేరింగ్ అన్ని వస్తాయి" అని షావలి తన భావాన్ని 'మనబడి'తో పంచుకున్నారు.

## నా పిల్లలు మా బడిలో ఉంటే... మిగిలిన తల్లిదండ్రులను అడగవచ్చు



సీహెచ్ మోక్షశ్రీ, సీహెచ్ పూజశ్రీ అనే చిన్నారులు భీమునిపట్నం మండలం చిట్టివలస జిల్లా పరిషత్ (బాలికల) పాఠశాలలో 9వ, 7వ తరగతుల విద్యార్థులు. వీళ్ల నాన్న గారు అమర్నాథ్ భీమునిపట్నం సంతపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా అమర్నాథ్ పంచుకున్న మాటలివి... "నేను మొదటి నుండి నా పిల్లలను గవర్నమెంట్ స్కూల్ లోనే చదివించాలని నిర్ణయించుకున్నాను. మా పాఠశాలలో పిల్లలను జాయిన్ చేయమని వేరే తల్లిదండ్రులను అడగాలంటే నా పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారని చెప్పడానికి గర్వపడుతున్నాను. మా పిల్లలకు ఒత్తిడి లేని చదువు అందించాలని మొదటి నుండి అనుకోవడం వల్ల, ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల పట్ల మాత్రమే నాకు ఆసక్తి ఎక్కువ. అందువలన నాకు ప్రభుత్వ పాఠశాల

తప్ప మరే ఇతర పాఠశాలలు ప్రత్యామ్నాయం అనిపించలేదు.''

## నేను చదివిన పాఠశాలల్లోనే... నా కొడుకును చదివిస్తున్నా

ఈ ఫొటోలో విద్యార్థి గొంప శరత్ చంద్రదేవ్. భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.



ఈ అబ్బాయి తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. తండ్రి గొంప శ్రీను, స్కూల్ అసిస్టెంట్ తెలుగు (జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కవులువాడ, భోగాపురం), తల్లి వెంకటలక్ష్మి పీఈటీ (జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, పాలవలస చీపురుపల్లి).

“మా ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో చదివే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్థిరపడ్డాం. నేను చిన్నప్పుడు చదివిన భోగాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, ఉన్నత పాఠశాలలో నా కొడుకును చదివిస్తున్నాను. ప్రభుత్వ విద్య మీద మాకు ఉన్న నమ్మకంతో నా కొడుకును చదివిస్తున్నాం. మా అబ్బాయి ప్రభుత్వ పాఠశాలలో చదివినా ఉన్నత స్థాయికి వెళ్తాడని మేము బలంగా నమ్ముతున్నాం. ‘మీరు ప్రభుత్వ టీచర్స్ అయ్యి, ప్రభుత్వ పాఠశాల్లో చదివించడం ఏంటి?’ అని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. ప్రభుత్వ విద్య మీద ఉన్న నమ్మకం`` అని అంటాం మేము..

## ప్రభుత్వ బడి అనురాగాన్ని పంచుతుంది

ఈ అబ్బాయి పేరు మోకా మోజేష్. డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం జీవీజీ రామేశ్వరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఈ చిన్నారి తల్లి జి.జి.భవానీ అదే పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయిని. తన బిడ్డను ప్రభుత్వ బడిలో చదివించడానికి కారణం ఇలా చెప్పుకున్నారు.. “ఆది గురువైన అమ్మఒడి తర్వాత ప్రభుత్వ బడి మాత్రమే ఆ అనురాగాన్ని పంచుతుంది. అంతేకాకుండా మన ప్రభుత్వ బడుల్లో చదివి ఉన్నత స్థానాల్లో నిలిచి ఎంతోమందికి మార్గదర్శకులు ఉన్నారు. ఆ అభివృద్ధి కేవలం ప్రభుత్వ బడుల్లో చదివిన వారికి మాత్రమే సాధ్యమని నమ్మి మా అబ్బాయిని ప్రభుత్వ బడిలో చదివిస్తున్నాం. ఈ స్ఫూర్తితోనే మా ప్రాంతంలోని తల్లిదండ్రులు మా పాఠశాలలో వారి పిల్లలను



చదివించడానికి పంపిస్తున్నారు. మా అబ్బాయి మోజేష్ చదవడం, రాయడం వంటి చతుర్విధ ప్రక్రియలు చేయడంలో కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ఉన్నాడంటే దానికి కారణం.. మన ప్రభుత్వ బడిలో చదివించడం వలన మాత్రమేనని నా అభిప్రాయం''.

## ప్రభుత్వ బడిలో సొంతంగా నేర్చుకుంటారు



నేనొక సయ్యద్ అసిఫ్ అబ్బాస్ హుస్సేన్. లైబ్రరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. నంద్యాల జిల్లా బనగానపల్లెలోని ఎమ్.ఎమ్.పి. ఉర్దూ పాఠశాలలో మా అమ్మాయి మూడో తరగతి, మా అబ్బాయి ఒకటో తరగతి చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు తమ పనులను తామే చేసుకోవడం నేర్చుకుంటారు. ఇక్కడ ఎవరూ వారికి తినిపించరు, నిజమైన విద్య వస్తుంది అని మేము నమ్ముతున్నాం. "దీపం ఎక్కడ ఉంచినా వెలుగు ఇస్తుంది" అని నమ్ముతాను. ఉపాధ్యాయులు వారిని బాగా చూసుకుంటున్నారు. వారు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నారు. పాఠశాల ద్వారా వారికి కిట్లు, మధ్యాహ్న భోజనం (MDM) అందిస్తున్నారు. వారి మార్కులను కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు.



## ప్రభుత్వ బడిలో అన్ని వసతులు

ఈ చిన్నారి చక్కా హన్విక. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కొత్త కొట్టాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుంది. తండ్రి చక్కా ఆర్ఎస్ఎన్ నాగేశ్వరరావు. అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు. “విషయాలను బట్టీ పట్టకుండా అవగాహన కలిగించి ఒత్తిడి లేని, నాణ్యమైన విద్యను అందించే ఉపాధ్యాయులు ఉన్న, అన్ని వసతులు కలిగిన బడిలో చేర్చాలన్నదే మా కోరిక. అందుకే మా పాపను ప్రభుత్వ బడిలో చేర్పించాను'' అని తెలిపారు.



## మా అమ్మాయి స్వేచ్ఛగా చదువుకుంటోంది

ఈ చిన్నారి పేరు వుడతా వైష్ణవి. తండ్రి వుడతా వెంకటేశ్వరరావు. 2010లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని పినపళ్ల పాఠశాలలో చేరారు. 2021లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు మండలంలో చింతలూరు గ్రామంలో కలప మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. “మొదట నుంచి కృత్యాధార బోధన, సమాజంలో మారుతున్న సాంకేతిక వనరులను ఉపయోగించి బోధించడం



అనేది ఇష్టం... అందుచేతనే 2017లో రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రొజెక్టర్ సహాయంతో విద్యా బోధన చేశాను. ప్రస్తుత పాఠశాలలో ఒత్తిడికి లోను కాకుండా, స్వేచ్ఛాపూరిత వాతావరణంలో మా అమ్మాయి చదువుకోవడానికి, మేము విద్యార్థులకు అందిస్తున్న విద్య నాణ్యత పై నమ్మకంతో మా అమ్మాయిని ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మా ప్రభుత్వ పాఠశాలలోనే నాలుగో తరగతిలో జాయిన్ చేశాను. అప్పటినుండి మా అమ్మాయి ఒత్తిడి లేని ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసిస్తుంది.... ఇది చూసిన గ్రామంలోని చాలామంది తల్లిదండ్రులు మేము అందిస్తున్న విద్యపై నమ్మకంతో వారి పిల్లలను ప్రైవేటు స్కూళ్ల నుండి తీసుకువచ్చి మా పాఠశాలలో మా మీద నమ్మకంతో జాయిన్ చేసారు.. ఇదేవిధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు కూడా మంచి నమ్మకం ఏర్పడుతుంది'' అని తన భావాన్ని పంచుకున్నారు.

## విద్యార్థి పరిపూర్ణతకు వేదిక మనబడి

ఈ చిన్నారి పేరు సిహెచ్. అమేయ కృష్ణ. అంబాజీపేట మండలంలోని ఎంపిపిపిఎస్ బెహరా వారి అగ్రహారంలో చదువుతుంది. అమేయ



తల్లి నాగ శ్రీదేవి కుసుమ. డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఆమె మాటల్లో.. ''ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య ప్రగతిశీల మార్గాల వైపు సాగుతున్న ప్రక్రియపై నాకు ప్రగాఢ నమ్మకం ఉంది. టీచర్ గా నా విద్యార్థులకు బోధించే, వ్యవహరించే విధానాలపై నాకు నమ్మకం ఉంది. నా విద్యార్థులను గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తాను. పేజీలు నింపడం, వారి మనస్సులలో అనవసరమైన విషయాలను నింపడం కంటే వారి ప్రవర్తన మార్పుపై ఎక్కువ దృష్టి పెడతాను. అందుకే నా కూతురిని నేను బోధిస్తున్న పాఠశాలలోనే చేర్పించాను. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యలో జరుగుతున్న ప్రతి మార్పు పురోగతి, పరిపూర్ణతకు ఒక అద్భుతమైన సంకేతం. ఈ చారిత్రక మార్పులు ఫలాలను ఇవ్వడానికి కొంచెం ఎక్కువ సమయం పట్టవచ్చు ఎందుకంటే బలమైన, లోతైన మూలాలను ఏర్పరచడానికి ఎక్కువ సమయం పడుతుంది కదా'' అని భావాన్ని వ్యక్తపరిచారు.

## ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకర బోధన

ఈ విద్యార్థుల పేర్లు బొమ్మిశెట్టి శ్రీసాయి (10వ తరగతి), బొమ్మిశెట్టి శ్రీలక్ష్మి (9వ తరగతి). పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, లక్కరాజు గార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. తండ్రి బొమ్మిశెట్టి పాపయ్య స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ప్రభుత్వ పాఠశాలలో



తమ పిల్లలను ఎందుకు చదివిస్తున్నారంటే.. ''విశాలమైన తరగతి గదులు. ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకర బోధన చేస్తారు. పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించే హెచ్ఎం ఉన్నారు. విద్యార్థుల్లో ఏరోజుకారోజు ప్రేరణ కలిగిస్తూ విద్యను అందించే ఉపాధ్యాయులు ఉన్నారు. అంకితభావంతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు అందిస్తుంది ఇంతకన్నా ఇంకేం కావాలి. అందుకే మా పిల్లలిద్దరినీ ప్రభుత్వ బడిలో చదివిస్తున్నాం. ప్రభుత్వ బడిలో చదివితే నైతిక, మానవీయ విలువలు తెలుస్తాయి. ఎన్ని సమస్యలైనా ఎదుర్కొనే నైతిక బలం పెరుగుతుంది.'' అని పాపయ్య మాస్టారు చెప్పారు.

## ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచేందుకే..

ప్రభుత్వ విద్యాలయాల్లో అర్హత అర్హత కలిగిన ఉపాధ్యాయులు.. అందుబాటులో సదుపాయాలు ఉంటున్నప్పుడు ప్రైవేటు స్కూళ్లలో లక్షలు పోసి చదివించాల్సిన అవసరం ఏముంది అంటున్నారు గడిముడిదాం ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ పండితుడిగా పనిచేస్తోన్న డోల వాసుదేవరావు. తాను టీచర్‌గా పనిచేస్తున్న గడి ముడిదాం ప్రాథమికోన్నత పాఠశాలలోనే కుమార్తె డోల అవిసా కాపు నాలుగో తరగతి చదువుతోంది. కుమారుడు రివాన్ నాయుడు డోలపేట ఎంపీపీ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వ బడులపై ప్రజల్లో నమ్మకం మరింతగా పెంచడమే లక్ష్యంగా తన పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించానని చెబుతున్నారు వాసు మాస్టారు.



– **గణేశ్ బెహరా**, పీఆర్వో, సమగ్ర శిక్ష, 77320 97027




# పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకత (ECCE ఆవశ్యకత)


**పూ**ర్వ ప్రాథమిక విద్య (Early Childhood Care and Education) ప్రపంచవ్యాప్తంగా విద్యా నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు గుర్తించిన అత్యంత కీలకమైన అంశం. బాల్యం అనేది వ్యక్తిత్వ అభివృద్ధికి పునాది వేస్తుంది. పిల్లల మెదడు అభివృద్ధి జీవితపు తొలి ఆరు సంవత్సరాల్లో 85% పూర్తవుతుందని NEP-2020 స్పష్టం చేసింది. ఈ దశలో సరైన విద్యకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తే భవిష్యత్తులో పిల్లలు దేశ ఆర్థిక ఉత్పాదకతలో కీలకపాత్ర వహించే విధంగా ఎదుగుతారు.

పూర్వ ప్రాథమిక విద్య ద్వారా పిల్లల భాషా అభివృద్ధి, మానసిక స్థిరత్వం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ నియంత్రణ సాధ్యపడుతుంది. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు నేర్పే విద్యా విధానాలు సరళంగా, ఆసక్తికరంగా ఉండాలి. ఆటల ద్వారా బోధన అనేది ECCEలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. పిల్లలు తాము అనుభవం ద్వారా అనేక విషయాలను తేలికగా నేర్చుకుంటారు. అందుకే వారికి కథలు, గేయాలు, పాటలు, దృశ్యవిశ్లేషణ, మృదుస్పర్శ, స్వరాలు వంటి అనేక విధానాల ద్వారా బోధించాలి.

భారతదేశంలో జాతీయ విద్యా విధానం (NEP) 2020 పూర్వ ప్రాథమిక విద్యకు ప్రత్యేక స్థానాన్ని ఇచ్చింది. ఈ విధానంలో Foundational Stage (3-8 సంవత్సరాలు) అనే ఈ కొత్త దశను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ దశలో పిల్లలకు సరైన శిక్షణ, పోషణ, ఆరోగ్య సంరక్షణ, ఆటల ద్వారా అభ్యసన అందించాలి. ప్రస్తుతం అంగన్వాడి కేంద్రాలు, ప్రైవేట్ ప్రీ-స్కూల్స్, ప్రాథమిక పాఠశాలలలోని ప్రీ-ప్రైమరీ తరగతులు ECCE సేవలను అందిస్తున్నాయి. ECCE అమలులో ప్రధానంగా భాషా అభివృద్ధి, శారీరక చలన నైపుణ్యాల అభివృద్ధి, భావోద్వేగ నియంత్రణ, సృజనాత్మక ఆలోచన, సామాజిక నైపుణ్యాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వడం జరిగింది.

సైన్స్ & టెక్నాలజీ పురోగమిస్తున్న ఈ కాలంలో, పిల్లలకు పూర్వ ప్రాథమిక స్థాయిలోనే ఆలోచనా నైపుణ్యాలు, అన్వేషణాత్మక మనస్తత్వం, సమస్య పరిష్కార నైపుణ్యాలు నేర్పించాల్సిన అవసరం ఉంది. దీనికొరకు, నూతన విద్యా విధానాలతో పిల్లలు చిన్ననాటి నుంచే పాఠశాలలను ఆసక్తికరమైన ప్రదేశాలుగా భావించేలా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. పిల్లల అభివృద్ధిని ప్రోత్సహించే సృజనాత్మక తరగతులతోపాటు, పాఠ్యేతర కార్యక్రమాలు, కథలు, కళారూపాలు, ఆటల ద్వారా నేర్పే విధానాలు ECCEలో విద్యలో చేర్చడం జరిగింది .

మెదడు అభివృద్ధి.




ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నివేదిక ప్రకారం, పూర్వ ప్రాథమిక విద్యను పొందిన పిల్లలు భవిష్యత్తులో మెరుగైన బుద్ధి, సామాజిక నైపుణ్యాలు, స్వీయనియంత్రణ, ఆర్థిక స్థిరత్వం, అధిక ఉపాధి అవకాశాలు పొందే లక్షణాలనుఎక్కువగా కలిగి ఉంటారు. అంతేకాక, పూర్వ ప్రాథమిక విద్య అందని పిల్లలు శారీరక, మానసిక, సామాజిక అవరోధాలను అధిగమించడంలో కష్టపడవలసి వస్తుంది.

మన రాష్ట్రంలో ECCEని మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటు, అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ, సమగ్ర మూల్యాంకన విధానాలు వంటి చర్యలను చేపడుతోంది. అయితే, ప్రాథమిక విద్యలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అనేది అత్యంత కీలకం. పిల్లలకు సరైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఎందుకు ఈ స్థాయి విద్యకు ఇంత ప్రాధాన్యత అని ఆలోచిస్తే, మానవ మెదడు అభివృద్ధి ఒక క్రమబద్ధమైన ప్రక్రియగా సాగుతుంది, ఇందులో వివిధ కార్యాచరణలకు అవసరమైన న్యూరల్ కనెక్షన్లు విభిన్న దశల్లో అభివృద్ధి చెందుతూ వుంటాయి. ఈ ప్రక్రియలో ప్రధానంగా సంజ్ఞాపథాలు, భాషా నైపుణ్యాలు, ఉన్నత జ్ఞానాత్మక సామర్థ్యాలు మూడింటి పెరుగుదల ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

## 1. ఇంద్రియాల ద్వారా అభ్యసన అభివృద్ధి

పుట్టిన తర్వాత ప్రథమ దశలో దృశ్య, శ్రవణ, స్పర్శ, రుచీ, వాసన వంటి అంశాలకు సంబంధించిన న్యూరల్ కనెక్షన్లు వేగంగా అభివృద్ధి చెందుతాయి. మొదటి రెండు సంవత్సరాలలో పిల్లలు ప్రపంచాన్ని గ్రహించేందుకు ఈ సంజ్ఞాపథాలను ఎక్కువగా ఉపయోగిస్తారు. తల్లిదండ్రుల ముఖాలను గుర్తుపట్టడం, శబ్దాలకు ప్రతిస్పందించడం,

చేతులను కదిపి అన్వేషించడం వంటి చర్యలు ఈ దశలో జరుగుతాయి. విజ్ఞాన పరిశోధనలు చెబుతున్నట్లు, చిన్న వయస్సులో పిల్లలు పొందే అనుభవాలు వారి మెదడు వృద్ధిని తీర్చిదిద్దుతాయి.

## 2. భాషా నైపుణ్యాల మెరుగుదల


ఇంద్రియాల ద్వారా అభ్యసన అభివృద్ధితో పాటు భాషా నైపుణ్యాలు కూడా అభివృద్ధి చెందుతాయి. మొదటిగా, పిల్లలు శబ్దాలను గ్రహించి వాటిని గుర్తుపడతారు. ఆ తర్వాత, పదాలను పోలిక చేసుకుంటారు, పదబంధాలను నిర్మించుకుంటారు, మరియు తల్లిదండ్రుల లేదా ఇతర పెద్దవారి మాటలను అనుకరిస్తారు. సుమారు రెండేళ్ల నాటికి పిల్లలు చిన్న వాక్యాలు మాట్లాడడం ప్రారంభిస్తారు. భాషా అభివృద్ధి వల్ల పిల్లల సామాజిక పరస్పర చర్యలు బలోపేతం అవుతాయి, వారి భావాలను వ్యక్తపరిచే సామర్థ్యం మెరుగవుతుంది.

## 3. ఉన్నత జ్ఞానాత్మక సామర్థ్యాల పెరుగుదల

3–5 ఏళ్ల వయస్సు నాటికి పిల్లలు సమస్యల పరిష్కారం, విశ్లేషణ, తర్కబద్ధమైన ఆలోచన, ఊహాశక్తి వంటి అంశాలను అభివృద్ధి చేసుకోవడం ప్రారంభిస్తారు. ఈ దశలో వారిలో సృజనాత్మకత, కొత్త విషయాలను నేర్చుకునే ఆసక్తి, స్వయం నియంత్రణ పెరుగుతాయి. 6–8 సంవత్సరాల నాటికి, పిల్లలు తార్కికంగా ఆలోచించే శక్తిని పెంపొందించుకుంటారు, నూతన విషయాలను అర్థం చేసుకునేందుకు మెదడు మరింత అనుకూలంగా తయారవుతుంది.


## 4. మెదడు అభివృద్ధి & అభ్యసన సామర్థ్యం

పుట్టినప్పటి నుండి 8 సంవత్సరాల వయస్సు వరకు పిల్లల అభ్యసన సామర్థ్యం అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. ఈ కాలంలో మెదడు ప్లాస్టిసిటీ అత్యధికంగా ఉంటుంది, అంటే పిల్లలు వేగంగా నేర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. ఈ దశలో సరైన శిక్షణ, అనుభవాలు, మరియు ప్రోత్సాహం ఇవ్వడం వారి భవిష్యత్ అభివృద్ధికి అత్యంత అవసరంగా మారుతుంది. పిల్లల అభివృద్ధిలో ఈ దశ ఎంతగానో ప్రభావం చూపుతుందనే కారణంగా Foundational Learning అంటే ప్రాథమిక దశలో అభ్యసన ఇప్పుడు విద్యా రంగంలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.




## మెదడు అభివృద్ధి ప్రక్రియ – ఒక దృష్టాంత గణనం

జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు పిల్లల మెదడు అభివృద్ధికి అత్యంత కీలకం. ఈ సంవత్సరాలలో మెదడులో న్యూరాన్ల మధ్య అనుసంధానాలు (న్యూరోనల్ కనెక్టివిటీ) అత్యంత వేగంగా ఏర్పడి, బుద్ధి వికాసానికి బలమైన పునాది వేస్తాయి. పిల్లలు అనుభవాలను పొందినప్పుడు, ప్రతి అనుభవం కొత్త న్యూరోనల్ మార్గాలను సృష్టించడానికి లేదా బలపరచడానికి సహాయపడుతుంది. వినడం ద్వారా, మాట్లాడటం ద్వారా, తాకడం ద్వారా , దృష్టి ద్వారా నేర్చుకోవడం అనేది ఈ అనుసంధానాలను మరింత బలంగా మారుస్తాయి. ఈ ప్రక్రియ ద్వారా మెదడు అభివృద్ధి చెందుతూ భవిష్యత్తులోని బుద్ధి వికాసానికి పునాది వేస్తుంది. అనుభవాలు, సంభాషణలు, ఆటలు మెదడు అభివృద్ధిని ప్రేరేపిస్తాయి. కాబట్టి, ఈ దశలో అనుకూలమైన పరిసరాలు, ప్రేమతోకూడిన సంరక్షణ, మరియు నాణ్యమైన విద్య అందించడం అవసరం.




ఈ క్రింది గణనాచిత్రం (Graph) ద్వారా మానవ మెదడు అభివృద్ధి వివిధ దశలలో ఎలా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

మెదడు అభివృద్ధి 90% జననం నుండి 6 సంవత్సరాల లోపలే పూర్తవుతుంది. దీనివల్ల చిన్నతనంలో మంచి శిక్షణ అనుభవాలు అవసరమని అర్థమవుతుంది.

### ప్రాముఖ్యత & మళ్లీ పరిశీలన

1. ఇంద్రియాల ద్వారా అభ్యసన అభివృద్ధి – తొలి రెండేళ్లలో గ్రహించే శక్తి అత్యధికం.

2. భాష అభివృద్ధి – 2–4 ఏళ్ల నాటికి పదబంధాలు రూపొందించుకునే సామర్థ్యం పెరుగుతుంది.

3. జ్ఞానాత్మక సామర్థ్యాలు – 3–8 ఏళ్ల మధ్య ఊహాశక్తి, తర్కశక్తి పెరుగుతాయి.

4. విద్యా అభ్యసన యొక్క ప్రాధాన్యత – 6–8 ఏళ్ల వయస్సు వరకు మెదడు అత్యధికంగా అభ్యసనాన్ని కోరుకుంటుంది.

మానవ మెదడు అభివృద్ధిలో ప్రాథమిక దశలో కలిగే అనుభవాలు, విద్యా పద్ధతులు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనవి. నాణ్యమైన విద్య, సరైన ప్రేరణ, మానసిక వికాసానికి అనుగుణమైన అనుభవాలు చిన్నారుల్లో మెరుగైన భవిష్యత్తును నిర్మించడానికి సహాయపడతాయి. మానవ జీవితంలో 6–8 సంవత్సరాల వయస్సులో మెదడు అభివృద్ధి ప్రాధాన్యతను గుర్తించి, నేడు విద్యా విధానాల్లో మార్పులు తీసుకురావడం జరిగింది. చిన్ననాటి సంరక్షణ మరియు విద్యా అభ్యసన విధానాలు పిల్లల మెదడు పెరుగుదలపై శాశ్వత ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి, మొదటి 8 సంవత్సరాలలో పిల్లలకు అందించే అనుభవాలు వారి జీవితాన్ని తీర్చిదిద్దే విధంగా ఉండాలి.

– **సరిత కోటిపల్లి,** ప్రొఫెసర్, ఎస్సీఈఆర్టీ, 94418 96699


# గురువుని ఎప్పటికీ మరువలేం

* *గురుపూజోత్సవ సభలో సీఎం చంద్రబాబు*
* *ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనసన్మానం*

టీచర్లను జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు.

భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మానవ వనరులు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఏ-కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన గురుపూజోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు అవార్డులు అందజేశారు.

"పిల్లల్లో స్ఫూర్తిని కలిగించేది, మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది గురువులే. భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారు. నేను నిత్య విద్యార్థిని.. ప్రతి రోజూ ఏదోకటి నేర్చుకుంటా. తల్లికి వందనం పేరుతో పిల్లలు చదువుకునేందుకు అండగా ఉన్నాం. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం ఇస్తున్నాం" అని చంద్రబాబు పేర్కొన్నారు.



### నేనుండగా ఉద్యోగులకు ఏ ఇబ్బందీ రాదు... రానివ్వను

"భారత్‌లో ఉన్న కుటుంబ విలువలు ప్రపంచంలో ఎక్కడా లేవు. భార్యాభర్తలు పరస్పరం గౌరవించుకోవడం.. పిల్లల కోసం కష్టపడటం ఎక్కడా లేవు. ఈ విలువలు కాపాడుకుంటే చాలు.. మన పిల్లలు ఏదైనా సాధిస్తారు. నేనుండగా ఉద్యోగులకు ఇబ్బంది రాదు.. రానివ్వను. ఉద్యోగుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యత నాది. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టీచర్లు తమ సిలబస్‌ను కూడా రీరైట్ చేసుకోవాలి. పిల్లలకు ఎలాంటి సిలబస్ అవసరమో రివైజ్ చేసుకోవాలి. టెక్నాలజీ విషయంలో నేటితరం పిల్లలు చాలా ఫాస్ట్ ఉన్నారు. సమాజంలో జరిగే మార్పులకు అనుగుణంగా కరిక్యులమ్ ఉండాలి. ఉపాధ్యాయులు కూడా నిత్యం అప్డేట్ కావాలి. పిల్లల్లో సృజనాత్మకతను పెంచే బాధ్యత గురువులదే" అన్నారు.

### అందుకే చుక్కా రామయ్యపై గౌరవం

"ఐఐటీ కోచింగ్ విషయంలో చుక్కా రామయ్య కచ్చితంగా ఉండేవారు. పదివేలమంది దరఖాస్తు చేస్తే వందమందికి ఐఐటీ శిక్షణ ఇచ్చేవారు. వందకు వందమందినీ ఐఐటీకి పంపేవారు. అదీ ఆయన గొప్పతనం. ముఖ్యమంత్రిగా నేను సిఫారసు చేసినా సీటు ఇవ్వబోనని చెప్పేవారు. అందుకే చుక్కా రామయ్య అంటే గౌరవం పెరిగింది. పిలిపించి మాట్లాడా, మీ కోచింగ్ ప్రత్యేకత ఏమిటని అడిగి తెలుసుకున్నా" అని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

### టీచర్లు నిత్య విద్యార్థులు కావాలి

ఒకప్పుడు ఐటీ అర్థమయ్యేది కాదు... కానీ ఇప్పుడు ఐటీ రియాల్టీ.

టీచర్లు ఐటీ నాలెడ్జ్ కూడా పెంచుకోవాలి. టెక్నాలజీని అంది పుచ్చుకోవాలి.

ఏఐ వంటి టూల్స్ ఉపయోగించి విద్యార్థులకు చాలా నేర్పించవచ్చు.

క్వాంటం కంప్యూటింగ్ తెస్తున్నాం. క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం.







మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేసుకోవాలి.

టెక్నాలజీ విషయంలో మీకంటే.. పిల్లలు వేగంగా ఉంటే.. అది టీచర్లకు ఛాలెంజ్‌లాంటింది.

యువత అవసరాలను... ప్రస్తుత ట్రెండ్సును తెలుసుకుంటూ అప్డేట్ కావడం నాకూ.. మీకూ అవసరం.

థియరీనే కాకుండా... వినూత్నమైన ఆలోచనలతో చదువు చెప్పాలి.

టీచర్ల బాగోగులు చూసుకునే బాధ్యత నాది. విద్యార్థుల బాధ్యత టీచర్లది. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి.

తల్లికి వందనం పథకానికి రూ.10 వేల కోట్లు వెచ్చిస్తున్నాం.

2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ స్థానానికి మన దేశం వెళ్తుంది. ప్రపంచంలో తెలుగుజాతి నెంబర్ వన్‌గా ఉంటుంది. నా ఆకాంక్షలు నెరవేరాలంటే టీచర్లంతా సహకరించాలి. ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.



## ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కల సాకారం చేద్దాం

– విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రభుత్వ విద్య గురించి మాట్లాడితే ఏపీ గురించి మాట్లాడాలని, అందరం కలిసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను సాకారం చేద్దామని గురుపూజోత్సవ సభలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ''చంద్రబాబు గారి నాయకత్వంలో చరిత్రలో మొదటిసారి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్లు బోర్డులు పెట్టారు. ఇందుకు కారణం ఇక్కడున్న ఉపాధ్యాయులు. ఎప్పుడూ లేనివిధంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాం. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, విద్యార్థులను అనుసంధానం చేశాం. గడిచిన ఏడాదిలో విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాం. మీ అందరితో చర్చించే తీసుకువచ్చాం. అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం లేదు. మీ స్వరం విన్న తర్వాతనే సంస్కరణలు తీసుకువచ్చాం. మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయి. వచ్చే నాలుగేళ్లు సంస్కరణలు ఉండవు.''







## లీప్ ..టాప్ లో నిలవాలి

ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్(LEAP)లీప్ మోడల్ ను పకడ్బందీగా మీరు అమలుచేయాలని కోరుతున్నా. కరిక్యులమ్ లో అనేక మార్పులు తీసుకువచ్చాం. ప్రైమరీ స్కూల్స్ లో తరగతికో ఉపాధ్యాయుడు విధానం తీసుకువచ్చాం. 9,600 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుచేశాం. సెమిస్టర్ వైజ్ టెక్స్ట్ బుక్స్ ను అందిస్తున్నాం. ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి యోగా, ఎన్ సీసీ, ఎన్ ఎస్ఎస్ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

## డీఎస్సీ అంటే చంద్రబాబు గారు..

పారదర్శకంగా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తీసుకువచ్చాం. మొదటి సారి సీనియర్ లిస్ట్ ఫిక్స్ చేశాం. ఎప్పుడూ లేనివిధంగా ప్రమోషన్లు కల్పించాం. సుమారు 80శాతం మంది ఉపాధ్యాయులు చంద్రబాబు గారి హయాంలో నియమితులైన వారేనని బలంగా నమ్ముతున్నాను. డీఎస్సీ అంటే చంద్రబాబు గారు.. చంద్రబాబు గారంటే డీఎస్సీ. డీఎస్సీ అంటే ఎంత ఛాలెంజింగ్ మీ అందరికీ తెలుసు. డీఎస్సీ విషయంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా ఏడాదిలోనే పూర్తిచేయడం చాలా కష్టమైన పని. చంద్రబాబు గారి డైరెక్షన్ లో పూర్తిచేశాం.







### విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా పాఠ్యాంశాలు

చాగంటి కోటేశ్వరరావు గారి నాయకత్వంలో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా పాఠ్యాంశాలు రూపొందించాం. ఇంటర్ లో కరిక్యులమ్ రీవ్యాంప్ చేశాం. ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో ఆంధ్రా యూనివర్సిటీ గతంలో 7వ స్థానం నుంచి ఇపుడు 4వ స్థానానికి చేరుకుంది. స్టేట్ యూనివర్సిటీ కోటాలో ఫస్ట్ ర్యాంక్ వచ్చే దిశగా పనిచేస్తాం. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కరిక్యులమ్ మెరుగుపర్చాలి.

### గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ పై దృష్టి పెట్టాలి

మంత్రిగా మీ ముందు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం నా ఉపాధ్యాయులు. అందుకే ఉపాధ్యాయులను కొన్ని విషయాలను కోరాలనుకుంటున్నాను. మొదటిది గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్. మన పిల్లలకు మ్యాథ్స్, లాంగ్వేజెస్ లో బేసిక్స్ రావాలి. నేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. న్యాస్, అసర్ నివేదిక చూస్తే.. జాతీయ సగటు కంటే ఏపీ తక్కువగా ఉంది. ఇందులో చాలా ఇంప్రూవ్ కావాల్సిన అవసరం ఉంది. బ్రిడ్జి కోర్సుల వల్ల నేను చాలా నేర్చుకున్నాను. పిల్లలకు కూడా బ్రిడ్జ్ కోర్సు చాలా అవసరం. దీనివల్ల ఈ ఎవాల్యూషన్ లో కూడా టాప్ –3 రాష్ట్రాల్లో ఏపీ నిలబడాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరుతున్నాను.

### ప్రభుత్వ విద్య గురించి మాట్లాడితే ఏపీ గురించి మాట్లాడాలి

పోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పెద్దఎత్తున ర్యాంకులు సాధించాలి. మనకు అద్భుతమైన ఉపాధ్యాయులు ఉన్నారు. కంటెంట్, మెటీరియల్ ఇస్తాం. మనకు వచ్చే పిల్లలు నిరుపేద కుటుంబాల నుంచి వస్తారు. వారికి సరైన దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు చేస్తారు. అది చేసి చూపించాల్సిన బాధ్యత మనందరిది. విద్యలో ఢిల్లీలో మేజిక్ జరుగుతోందని అంటున్నారు. దానికి ఫుల్ స్టాప్ పెట్టాలని నేను భావిస్తున్నాను. ప్రభుత్వ విద్య గురించి ఎవరైనా మాట్లాడితే ఏపీ గురించి మాట్లాడాలి. చేసి చూపించే శక్తి మనందరికీ ఉంది. మనకు చాలా పాజిటివ్ లీడర్ షిప్ ఉంది. అందరం కలసికట్టుగా ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను కేవలం దేశానికే కాదు.. ప్రపంచానికి చేసి చూపించాలని ఉపాధ్యాయులందరినీ కోరుతున్నానన్నారు.



# సీజనల్ వ్యాధులొస్తున్నాయ్..
# జాగ్రత్త

## హాయ్ వర్షా...... మీ ఫ్రెండ్ తేజశ్రీ రాలేదు ఏంటి ?

తేజశ్రీ కి వైరల్ ఫీవరంట టీచర్, ఇంకో 4 రోజులు వరకు రాదు..

పిల్లలూ..... వర్షాకాలంలో చాలా రకాల వ్యాధులు వ్యాపిస్తాయి. చిన్నపిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో వారికి త్వరగా అటాక్ అవుతుంటాయి... వ్యాధుల రకాలు, వాటి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు మన డాక్టర్ గారి ద్వారా తెలుసుకుందాం..

1. వర్షాకాలంలో వ్యాధుల ప్రభావం పిల్లలపై చాలా ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల వైరస్, బ్యాక్టీరియా వంటివి వేగంగా పెరుగుతాయి. మనం తీసుకునే ఆహారం,నీరు, దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు వస్తాయి..
2. ముఖ్యంగా పిల్లల్లో జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి ఇలా చాలా రకాల సమస్యలు గాలి ద్వారా వర్షాకాలంలో వచ్చే అవకాశాలు ఎక్కువ.. ఇవన్నీ అంటువ్యాధులే... రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న పిల్లల్లో ఇవి తొందరగా ఒకరినుండి ఒకరికి సంక్రమిస్తాయి..
3. డయేరియా, కామెర్లు, టైఫాయిడ్, కలరా వంటి రోగాలు నీరు శుభ్రంగా లేకపోతే వస్తాయి..
4. న్యుమోనియా వంటి వ్యాధులు పిల్లల్లో బాగా వస్తాయి, న్యూమోనియా ఉన్న బ్యాక్టీరియా, వైరస్ లు గాలిలో ఉంటాయి,ఇవి శ్వాస తీసుకున్నప్పుడు శరీరంలోకి ప్రవహిస్తాయి. తద్వారా ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్లు రావచ్చు. ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి సోకే అవకాశాలు చాలా ఎక్కువ.

### న్యుమోనియా లక్షణాలు.

1. ఇవి ఎలా ఉంటాయంటే తరచుగా జ్వరం రావడం, దగ్గు, ఆయాసం, ఛాతిలో నొప్పి, ఈ వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు దగ్గుతో పాటు రక్తం పడటం కూడా జరుగుతుంది.
2. ఊపిరితిత్తుల చుట్టూ నీరు లేదా చీము చేరడం, శ్వాస తీసుకోవడంలో బాగా ఇబ్బంది పడతారు
3. బలహీనంగా ఉండటం, ఆహారం తీసుకోకపోవడం వంటి లక్షణాలు కూడా ఉంటాయి.

### న్యూమోనియా నివారణ పద్ధతులు

1. పిల్లలు ఉండే పరిసరాలు శుభ్రంగా ఉంచాలి.
2. రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉన్న ఆహారం పెట్టాలి. పాలు, గుడ్లు, పండ్లు, పప్పులు, కూరగాయలు తినాలి.
3. వర్షంలో తడవకుండా చూసుకోవాలి. జలుబు లేదా ఫ్లూ తీవ్రమైతే ఊపిరితిత్తులు ఇన్ఫెక్ట్ అయ్యి న్యూమోనియా వచ్చే అవకాశాలు ఎక్కువ. ఒంటిమీద తడిబట్టలతో ఎక్కువసేపు ఉండకూడదు.
4. పిల్లలు ఉండే గదుల్లో తేమ ఎక్కువ లేకుండా గాలి సరిగా ఆడేలా చూసుకోవాలి.
5. జలుబు, దగ్గు ఉన్న వారి దగ్గర పిల్లలను దూరంగా ఉంచాలి
6. పిల్లల్లో శ్వాస ఇబ్బందుల గమనించిన వెంటనే డాక్టర్ ని సంప్రదించాలి.

వర్షాకాలంలో సాధారణంగా పిల్లల్లో వచ్చే జ్వరాలు, ఫ్లూ జ్వరాలు..... వైరల్ ఇన్ఫెక్షన్లు వల్ల వస్తుంటాయి.

### ఫ్లూ జ్వరం లక్షణాలు.

1. అధిక జ్వరం (103 నుండి 105 )
2. శరీరం అంతా నొప్పులు రావడం
3. దగ్గు, గొంతునొప్పి
4. ఎక్కువ అలసట



### నివారణ చర్యలు

1. విశ్రాంతి ఎక్కువ తీసుకోవడం
2. ఎక్కువ ద్రవ పదార్థాలు, పండ్లరసాలు తీసుకోవడం
3. చేతులు శుభ్రంగా కడుక్కోవడం
4. చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం
5. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం

### ఫ్లూ జ్వరం నివారణ చర్యలు

1. జలుబు చేసినప్పుడు రుమాలు అడ్డుపెట్టుకోవాలి

2. దగ్గినప్పుడు మోచేతిని అడ్డం పెట్టుకోవాలి
3. జ్వరం ఉన్న పిల్లలనుండి దూరంగా ఉండాలి
4. ఈ జ్వరాలు పెద్దగా ప్రమాదం కావు.. ఇంటిదగ్గరే చిన్న చిన్న చిట్కాలతో చికిత్స అందించవచ్చు
5. తరచుగా చేతులు సబ్బుతో కడుక్కోవడం, వేడినీరు మాత్రమే తాగుతూ ఉండాలి
6. దగ్గు సిరప్ వేసుకోవడం వల్ల ఇంటిదగ్గరే తగ్గిపోతుంది
7. సరైన ఆహారం పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు పుష్కలంగా తీసుకోవాలి
8. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటే, వెంటనే డాక్టరుని సంప్రదించాలి.

## పిల్లల్లో జలుబు, దగ్గు లక్షణాలు

**వర్షాకాలంలో సాధారణంగా పిల్లల్లో జలుబు, దగ్గు వస్తుంటాయి.. వాటి లక్షణాలు ఎలా ఉంటాయో ఒకసారి చూద్దాం**

1. ముక్కు కారడం
2. ముక్కుదిబ్బడ
3. గొంతునొప్పి
4. తలనొప్పి
5. జలుబు, దగ్గుతో పాటు జ్వరంగా కూడా ఉంటుంది
6. ఒళ్లంతా నొప్పులుగా ఉంటుంది.

## నివారణ

1. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు రుమాలు లేని పక్షంలో మోచేతిని అడ్డుపెట్టుకోవాలి. వెంటనే చేతులు సబ్బుతో కడుక్కోవాలి..
2. గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం, గోరువెచ్చని మంచినీళ్లు మాత్రమే తాగాలి. గోరు వెచ్చని పాలు తాగాలి
3. ముక్కు దిబ్బడ, జలుబు చేసినప్పుడు ఆవిరి పట్టాలి
4. చల్లటి వాతావరణంలో అస్సలు తిరగకూడదు

**– డా. ఆర్.సురేష్ కుమార్,**
క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, విజయవాడ, 924787115






ఆహ్వానం...
మీ ప్రాంత యాసలో చక్కని అంశాన్ని తీసుకుని సృజనాత్మక రచనలు మాకు పంపండి.
బాగున్నవి ప్రచురిస్తాం. manabadimagazine@gmail.com

## శ్రీకాకుళం బాస...అందమైన యాస..



# బెమ్మరాచ్చసి

ఒకరోజు తోటలో పరింపళ్ళు ఏరుతున్న పెద్దమ్మ కూతుర్ని ఎలుగుబంటి ఎత్తుకుపొయింది. ఆ సంగతి ఆఊరి బారికోడు పెద్దమ్మతో సెప్పినాడు.పెద్దమ్మ తన పెద్దకొడుకులతో ఇలగిలగ అయ్యిందని... ఎల్లి మీసెల్లుల్ని ఇడిపించుకురమ్మని సెబితే "అమ్మో!!! మేమెల్లము.మమ్మల్ని సంపీదూ ఎలుగుబంటి" అని సెప్పి తప్పించుకున్నారు. సిన్నోడుతో సెబితే సరే అని సెప్పి పెడకన దోపిన బళ్ళెంతీసి దారుతీసి పట్టుకు బయలుదేరాడు. అలా ఎళుతుండగ సాకలిరేవు దగ్గర గాడిదలు మేస్తన్నాయి. మడియారి సూరయ్యనడిగి ఒక గాడిదను బాడుగకు తీసుకున్నాడు. దారిలో ఒక కుమ్మరోడు కుండలు కావిడిలొ ఏసుకొని ఎదురైనాడు. ఆడిని నీదగ్గర ఏటేటున్నాయి. అడిగినాడు. నాదగ్గర పిచ్చికలు, పమ్మిదలు, సిచ్చుబుడ్డీలు, పిడతలు, కుడతలు, గుగ్గిలం కుడతలు, సట్టిలు, మట్టులు, మూకుడ్లు, కలాయిలు, పెనాలు, దాకలు, అటికిలు, అంబలటికలు, కూటికుండలు, కుండలు, కడవలు, కూజాలు, గూనలు, బానలు, జాడీలు, అన్నీ ఉన్నాయి. నీకేటి కావాలో బేగి సెప్పు. నాకేటీ అక్కరనేదు కానీ మీయిల్లు కాలిపాతంది. నీకు తెలుసా... ఓరి నీ తస్సాదియ్య... ఇప్పుడా సెబుతావు... అని ఆ కుండలు అక్కడే వదిలేసి పరిగెత్తాడు. ఒక పెద్ద బాన, కుంపటి ఒకటి ఎంచుకొని








గాడిదమీద కట్టేసాడు. గాడిదను తోలుకోని ఎలతన్నాడు. అలా ఎలుతుంటే ఒక మేదరోడు ఎదురైనాడు. మేదరన్నా!... మేదరన్నా!... నీదగ్గిరేటున్నాయి?... నా దగ్గర జిబ్బిలు, బుట్టలు, గిలకలు, పెట్టిలు, సజ్జలు, మట్టులు, తట్టలు, గాడితట్టలు, కోలగూలు, కోలబుట్టలు, ఉల్లిపాయల బుట్టలు, ఉల్లిపాయల సజ్జలు, ఒడేల తడకలు, గత్తం పొడకలు, దాన్నెం పొడకలు, ఇతనాల పొడకలు, తడకలు, పచ్చబద్దల సేటలు, సేటలు, జంగిడ్లు, పట్లుకర్రలు, టిర్రిలు, ఊజులు, మానిలు, గుల్లలు, మూతిబుట్టిలు, ఈతసాపలు, తాటిసాపలు, ఇసనకర్రలు, తుంగసాపలు, కవ్వాలు, మునకాల కర్రలు, దుడ్డుగర్రలు, కత్తవ కర్రలు, కొరడాకర్రలు, ఉన్నాయన్నాడు. సరేగాని నీకీసంగత్తెలుసా? మీ పిక్కిరోడు నూతిలోన పడిపోండట. అంతే అవన్నీ అక్కడే పడేసి పరిగెత్తాడు. అందులో రెండుపెద్ద పచ్చబద్దల సేటలు, ఇసనకర్ర ఎంచుకొని గాడిదమీద కట్టేసాడు.. కొంత దూరం ఎళ్లాక ఒక కమ్మరోడు సామాన్లు అమ్ముతూ ఎదురైతే వాడిని ఆపి నీదగ్గర ఏటేటి ఉన్నాయో సెప్పు అంటే... కత్తులు, సాకులు, సురకత్తులు, బళ్లేలు, కటార్లు, కత్తిపీటలు, బొరిగిలు, కత్తవలు, గునపాలు, నక్కులు, సీలలు, కమ్ములు, కుంచం కట్లు, కుంచాలు, నక్కాకులు, తొడపలు, నాలు, మేకులు, మడతబందులు, గెడలు, అడ్డుగెడలు, పారలు, ఇంకా ఏటి కావాలన్నా ఉన్నాయి. అన్నాడు. సరేగానీ నీకో ఇసయం తెలుసా? మీ ఇంటిల దొంగలు పడ్డారట... అంతే... అవన్నీ అక్కడ పడేసి ఇంటికి పరిగెట్టాడు. అందులో ఒక పార, గునపాం(గడ్డపార), ఒక నక్కు తీసుకున్నాడు.. అలా కొంతదూరం వెళ్ళాక ఒక తాలు, పడుగులు అమ్మేవాడు కనిపిస్తే... "నీదగ్గర ఏటున్నాయి"? అడిగాడు. వాడి దగ్గర నులకతాలు, నులకుండలు, పురితాలు, పురికొసలు, సేదతాలు, కొబ్బరి తాలు, కన్నిలు, సిగిమోరలు, ఉట్టిలు, ఎత్తిడ్లు, వలలు, ఉయ్యాల తాలు, నొగతాలు, ముకుతాలు, మూతిబుట్టిలు, పడుగులు, పలుపులు... ఉన్నాయన్నాడు. సరేగాని నీకీ బోగట్టా తెలుసా... మీ ముసిల్దాయి జారిపడిపోయిందట... అనేసరికి అవన్నీ అక్కడ పడేసి పరిగెత్తాడు. అందులో ఒక పెద్ద పడుగు తీసుకొన్నాడు. అవన్నీ గాడిదపై వేసుకొని తిన్నగా ఎలుగుబంటి ఒండకు ఎళ్ళాడు.

అక్క చిన్నోడిని పలకరించింది. "ఎలుగుబంటి చూసిందంటే నిన్ను అమాంతం మింగెస్తది. వెళ్ళి అటక పై దాగో" అన్నది."అయితే ఈటన్నిటినీ అటక పైకి తీసుకెలతాను" అంటే " అలాగె" అన్నది. ఒక కుంపటి లో నిప్పులేసి నక్కును అందులొ పెట్టి విసనకర్రతో విసురుతూ ఎర్రగా కాల్చాడు. ఇంతలో ఎలుగుబంటి వచ్చి అన్నం వడ్డించమన్నది. పెద్దమ్మ కూతురు అన్నం వడ్డిస్తే తింటూ నెయ్యి వెయ్యమంది. ఈరోజు నెయ్యి చాలారుచిగా ఉందని కంచం నాకేసి మరీ తిన్నాడు. అటక పై మళ్ళీచప్పుడు. మీదికెళ్ళి పిల్లులని తరిమేస్తనుండు అంటే అవే పోతాయిలే అని సర్దిచెప్పింది వీడి అక్క. ఇంతలో మళ్ళీ చప్పుడు. "పిల్లి కాదు ఏదో ఉంది అటక పైన బుడ్డీ (దీపం) ముట్టించు చూస్తాను"అంది ఎలుగుబంటి. చిన్నోడు "నేను బెమ్మరాచ్చసుడ్ని నిన్ను మింగేస్తాను" అన్నాడు. అప్పుడు ఎలుగుబంటి "ఐతే నీ పల్లు (దంతాలు) చూపించు అంటే పార చూపించాడు. నీ గోలు చూపించు అంటే గునపం చూపించాడు. నీ చెవులు చూపించు అంటే చేటలు చూపించాడు. నీ కడుపేది అంటే బానను చూపించడు. నీ తోకేది అంటే పడుగు (పెద్ద లావుపాటి తాడు)ను కిందికి వదిలాడు. ఐతే నా అరుపు చూడని బబ్బబ్బ అని బబ్బర్లు కొట్టింది ఎలుగుబంటి. చిన్నోడు ఎర్రగా కాలిన ఇనపనక్కు(మొన కల్గిన ఇనుప కడ్డీ)ను గాడిద పై మోపాడు అంతే గాడిద గట్టిగా ఓండ్ర పెట్టింది. ఓరినాయనొ ఇంతపెద్ద బెమ్మరాచ్చసా అంటూ ఎలుగుబంటి భయపడిపోయి పరుగు లంకించుకుంది. చిన్నోడు అక్కను తీసుకొని ఇంటికి సుబ్బరంగా పారొచ్చినాడు. పెద్దమ్మ సంతసించింది.

– **వల్లూరు దాలినాయుడు,** *స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)*
*జిల్లా పరిషత్ హై స్కూల్ పొగిరి,*
*రాజాం మండలం విజయనగరం జిల్లా*









## పిల్లలం... మేము పిల్లలం

ఆటలా పాటల చిరు జల్లులం
హాయిగా ఎగిరే గాలిపటాలం
హద్దులు తెలియని గువ్వ పక్షులం
నవ్వుతూ నడిచే నిత్య దివ్వెళం
నాట్యలాడే నెమలి పిల్లలం
చదువులు నేర్చే చందమామలం
గురువులు మెచ్చే చిట్టీ పాపలం



**– తల్లావఝుల కృష్ణ సంతోష్,**
తాళ్లబురిడి, పార్వతీపురం మన్యం


## బొమ్మ గీశానోచ్!



**N.గీతిక** 9వ తరగతి
శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల TTD తిరుమల




**కె. మనోరంజని** (9వ తరగతి),
కేజీబీవీ, సంబేపల్లె, అన్నమయ్య జిల్లా




**పి.శ్రీలక్ష్మి,** (9వ తరగతి),
కేజీబీవీ, సంబేపల్లె, అన్నమయ్య జిల్లా



**బి.సుషిల్** 6వ తరగతి
శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల T.T.D తిరుమల

## తెలుసుకుందాం

1 భారతదేశపు మొట్టమొదటి దక్షిణాది రాష్ట్ర ప్రధానమంత్రి
*పీవీ నరసింహారావు*

2 బీహార్లు నలంద విశ్వవిద్యాలయం స్థాపించినది
*కుమారగుప్తుడు*

3 భారతదేశంలో అతి పెద్ద ఎడారి థార్ ఎడారి
*రాజస్థాన్*

4 విమానాల టైలర్ లో ఉపయోగించే వాయువు
*హీలియం*

5 'గేట్ వే ఆఫ్ ఇండియా' అని ఏ నగరానికి పేరు
*ముంబై*

6 బ్రహ్మ సమాజం స్థాపించినది ఎవరు?
*రాజా రామ్మోహన్ రాయ్*

7 ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం
*భారతదేశం*

8 'జన గణ మన'ను జాతీయ గీతంగా ఎప్పుడు ప్రకటించారు?
*24 జనవరి 1950న.*

9 భారతదేశపు మొదటి ఉపగ్రహం ఏది? ఆర్యభట్ట

10 ప్రపంచంలోనే ఎత్తైన జలపాతం ఏది?
*ఏంజెల్ జలపాతం (వెనిజులా)*

– **ధవళ తారాశంకర్ ప్రసాద్**, రాజాం

## భలే భలే బాలలం

బుడతలం మేము పిడుగులం
తల్లి ఒడిలోన గువ్వలం
తండ్రి ఎదపై నిద్రిస్తాం
స్నేహితులలో జతకడతాం

చక చక బడికి పోతాం
చదువులన్నీ చదువుతాం
గురువులందరికీ దండం పెడతాం
ఆటలెన్నో ఆడుతాం

మండు వేసవి వచ్చింది
బడికి సెలవులు ఇచ్చింది
తోటల్లో తిరగటం మాకిష్టం
చెట్టు ఎక్కి కాయలు
కోయడం భలే ఇష్టం
చిట్టిపొట్టి కథలు వింటాం
నీతి విలువలు తెలుసుకుంటాం
సంస్కృతిని కాపాడుతాం
మేము భావి భారత పౌరులం.



– **చాడ చైత్ర**, ఏడో తరగతి, శ్రీకాకుళం

## చుక్కలు కలిపి, రంగులేద్దాం






Source: www.freepik.com

## చదువు కోసం... (కథ)

రామాపురం గ్రామంలో ఓ కుటుంబం ఉండేది. కుటుంబ పెద్ద కృష్ణయ్య. ఆయనకి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. తినడానికి తిండి లేక చాలా దీన పరిస్థితి వారిది. కుటుంబ పోషణకు కృష్ణయ్య ఆటో నడిపితే, భార్య కూలీ పనికి వెళ్లేది. నలుగురిలో కవిత పెద్దమ్మాయి. ప్రభుత్వ బడిలో పదో తరగతి చదువుతుంది. తరగతిలో చురుగ్గా ఉంటుంది... పదో తరగతి పరీక్షలు రాసి స్కూల్ ఫస్ట్ వచ్చింది. పై చదువులు చదవాలంటే డబ్బులతో కూడిన పని అనుకుని 'ఏమయ్యో.. పది వరకు సదివించాం. కవితకు పెళ్లి సేసేద్దామా' అంది కృష్ణయ్య భార్య.

'ఆ.. సేద్దాం.. నలుగురు పిల్లలు పెద్దవుతున్నారు. బాధ్యత తీర్చుకుందాం' అని కృష్ణయ్య అంటుండగా కవిత ఇంట్లోకి వచ్చింది.



'చూడమ్మా కవిత, పెద్దమ్మాయివి. నీకు పెళ్లి చేద్దామని అమ్మా నేను అనుకుంటున్నాం. నువ్వేమంటావ్?'

'నాన్నా నేను చదువుకొని, మంచి ఉద్యోగం చేస్తాను'

'సరేనమ్మా, అమ్మ మాట పక్కనపెట్టి, సక్కగా సదువుకో తల్లీ' అనే తండ్రి మాట విని సంతోషించింది కవిత.

'తినడానికి మెతుకు లేదు కానీ కూతురు సదివిస్తాడటా' ఇరుగుపొరుగు మాటలు. 'మన ఊరికి మంచి పేరు తీసుకురావాలి పిల్లా' అని ఇంకొందరు.

ఎవరు ఏమన్నా వినీ విననట్లు కూతుళ్ల చదువుకోసం రాత్రింబవళ్లు కష్టపడేవాడు.

డిగ్రీ వరకూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన కవిత, టీచర్ల సలహాలు తీసుకుని పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకునేది. ఐఎఎస్ కావడమే లక్ష్యంగా చదివింది. ఉద్యోగం సాధించిన కవిత తండ్రికి ఫోన్ చేసింది.

'నాన్నా నీ కూతురు కలెక్టర్ అయ్యింది'...

కృష్ణయ్య సంతోషంతో కన్నీళ్లు పెట్టుకున్నాడు. 'కొందరి అనే మాటలు గుర్తు చేసుకొని,

కూతురు నా పేరు నిలబెట్టింది చాలు.' అనుకున్నాడు.

ఆడపిల్ల చదువు వృథా కాదని నిరూపించిన కవితను గ్రామస్థులంతా సన్మానించారు.

– **ప్రవళిక,** తొమ్మిదో తరగతి,
కేజీబీవీ, నంద్యాల జిల్లా

## విద్యార్థుల్లారా !! (పాట)

**పల్లవి:**

విద్యార్థుల్లారా మీరు చెడునడతలు నడవద్దు.
యువతీ, యువకుల్లారా మీరు పెడదారి పట్టొద్దు.
విద్యార్థుల్లారా మీరు చెడునడతలు నడవద్దు
యువతీ, యువకుల్లారా.. మీలో మార్పు రావాలి
వ్యసనాలకు అలవాటైతే చీకటవును... బ్రతుకు ॥2॥

మనదేశపు భవిష్యత్తు మీ చేతిలో ఉన్నది మరువకు.

**చరణం 1:**

ర్యాగింగులు చేస్తే మీకు ఏమి లాభమో చెప్పు
మాదక ద్రవ్యాల వల్ల నూరేళ్ళ బ్రతుకుకే ముప్పు ॥2॥

విద్యార్థివైన నీవు, ఒకసారి ఆలోచించవా?
నీ జీవిత గమ్యం చేరుకోవా ॥విద్యా॥

**చరణం 2:**

సరదాగా ఈతకు వెళ్ళి ప్రాణాలను తీసుకోకు.
బెట్టింగులు పెట్టి నీవు ఆగమయ్యిపోకు ॥2॥

మనిషివై పుట్టినందుకు మంచి మనిషిగా బ్రతుకు
కన్న తల్లిదండ్రులకు కడుపుకోత రానివ్వకు. ॥విద్యా॥

**చరణం 3:**

తెలిసి తెలియని వయసులోన ప్రేమలో పడతారు
తల్లి, తండ్రి మందలిస్తే ప్రాణాలు తీసుకుంటరు ॥2॥

బంగారు బాల్యాన్ని మధ్యలోనే వదలకునీవు
బ్రతికి సాధించి ఆదర్శంగా ఉండు నీవు ॥విద్యా॥

**చరణం4:**

సెల్ఫీల మోజులోన ప్రమాదంలో పడతారు
వీడియో వైరల్ అవడానికి రిస్క్ లెన్నో చేస్తారు. ॥2॥

మనిషివన్న సంగతి మరచి ప్రాణాలతో చెలగాటం
ప్రాణం పోయినాక ఏమున్నది జీవితం. ॥విద్యా॥

**చరణం 5:**

చదువుని ప్రేమించి చూడు, చదువుని యిష్టంగా చదువు
అవరోధాలెన్ని ఎదురైనా ఎదిరించి ముందుకు నడువు ॥2॥

గుండె నిండ నమ్మకంతో గమ్యాన్ని ఛేదించు
సమస్యకు సవాలు చేసి అనుకున్నది సాధించు ॥విద్యా॥

– **దోలా శ్యామలాదేవి**, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)
జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల
మార్కాపురం, ప్రకాశం జిల్లా 89783 34405




# వలస

***మీలో 33 మిలియన్ల మంది పిల్లలు పైగా తమతమ జన్మస్థలాల నుండి వలస వెళ్లారు***

**నేను ఎందుకు భయపడుతున్నాను:**

మానవ జీవన గమనంలో "వలసలు" అంతర్భాగం అయినవి. వేలాది సంవత్సరాలుగా ... బ్రతుకుదెరువు కోసమో లేదా చదువుల నిమిత్తమో మానవులు తమ జన్మస్థలాలనుండి తరలివెళ్లి నూతన ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నడుస్తున్న చరిత్ర కూడా భిన్నంగా లేదు. మనమంతా నిలకడలేని ప్రపంచంలో నివసిస్తున్నాము. ఈ ప్రపంచంలో ఇప్పటికే సుమారు 30 మిలియన్ల మంది ప్రజలు తమ దేశసరిహద్దులు దాటి వలస వెళ్లారు.

చాలామందికి ... మరింత మంచి జీవితం కావాలనే ఆలోచన వలసలు వెళ్ళడానికి ప్రేరేపణ అవుతున్నది. కానీ, చాలామంది పిల్లలకు వలస అనేది ఒక సానుకూలమైన ఎంపిక కాకుండా, ఒక తక్షణ అవసరమవుతున్నది. వారివారి జన్మస్థలాల్లో వారికి సురక్షితమైన, ఆరోగ్యవంతమైన, అనుకూలమైన జీవితం ఏ మాత్రమూ లేక ... నైరాశ్యంలో మునిగి ఉండి, తప్పనిసరిగా వలసవెళ్లిన పరిస్థితిలో ... చట్టపరంగా అవసరమైన అనుమతులు కూడా తీసుకోలేక ... వారు "అక్రమ ప్రవాసితులు" గా పిలువబడుతున్నారు. చాలా సందర్భాల్లో, వారు ... ఎడారులు, సముద్రాలు, దేశసరిహద్దులు దాటి అత్యంత ప్రమాదకరమైన ప్రయాణం చేయవలసిరావటమే కాకుండా ... హింసకు, తిట్లకు, దోపిడీ దౌర్జన్యాలకు గురి అవుతున్నారు.

అన్నిటికన్నా ఎక్కువ వలసలు సరిహద్దుల వెలుపల కాకుండా, సరిహద్దుల లోపలనే సంభవిస్తున్నాయి. మిలియన్ల కొద్ది ప్రజలు... గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వలస వెళుతున్నారు. 1989 లో కన్వెన్షన్ ఆన్ ద రైట్స్ ఆఫ్ ది చైల్డ్ (Convention on the Rights of the Child) ఆమోదించబడినపుడు... ఎక్కువ శాతం పిల్లలు గ్రామీణప్రాంతాల్లోనే నివసించే వారు. ఈ రోజున మాత్రం... అధిక మొత్తంలో పిల్లలు పట్టణప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. అందువల్ల, పట్టణీకరణ సూచి అభివృద్ధి చెందవలసి వస్తున్నది. సగటున... పట్టణవాసులకు మంచి సౌకర్యాలు, ఎక్కువ అవకాశాలు అందుబాటులో ఉన్నప్పటికీ, పట్టణ ప్రాంతాల పిల్లలు మాత్రం... అక్కడ ఉన్న అధిక అసమతుల్యతల వల్ల... గ్రామీణ ప్రాంతంలోని పిల్లలకన్నా దయనీయమైన స్థితిలో ఉన్నారు. ఉదాహరణకు, నాలుగు దేశాల్లో ఒక దానిలో... గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలతో పోలిస్తే... పట్టణ ప్రాంతంలోని పేదపిల్లలు అయిదు ఏళ్ళు నిండకముందే చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదేవిధంగా, ఆరు దేశాల్లో ఒక దానిలో... పట్టణ ప్రాంతాల్లోని అతి పేద పిల్లలు... గ్రామ ప్రాంతాల పిల్లలకన్నా ఎక్కువగా ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు.

## నేను ఎందుకు ఆశావహంగా ఉన్నాను:

ఏ ఒక్క పిల్లవాడికి కూడా తన ఇంటి నుండి తప్పనిసరిగా వలసవెళ్ళవలసిన ఆలోచన రావడం గానీ, అవసరం ఉత్పన్నమవడం గానీ జరుగకూడదు. కానీ, మూలకారణాలను పరిష్కరించేంత వరకు పరిస్థితిలో మార్పు ఉండే అవకాశం లేదు. అంటే, సామాజిక అత్యాచారాలకు గానీ, సామూహిక అత్యాచారాలకు గానీ పిల్లలు గురి కాకుండా... వారికి సామాజిక రక్షణనిచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వారికి మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించి, భవిష్యత్తులో... వారు తమకోసమే కాక తమ దేశాలకు కూడా రక్షణ కల్పించే విధంగా... వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసే అవకాశాలను వారికి కల్పించాలి.




యునిసెఫ్ అంచనాల ప్రకారం వేలాది మంది పిల్లలు ఒంటరిగానో లేదా వారి కుటుంబాలతో కలిసో... చట్టపరమైన అనుమతులు లేకుండా వలస వెళుతున్నారు. దానివల్ల, వారిపై అత్యాచారాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చట్టపరంగా గానీ, ఇతరత్రా గానీ... వలస వచ్చిన పిల్లల హక్కుల పరిరక్షణ అవశ్యం. వారు ఎక్కడైనా ఉండనివ్వండి, వారి కథ ఏదైనా కానివ్వండి... వలస వచ్చిన పిల్లలు పిల్లలే కదా! వలస చట్టాలను అమలు పరచడంలో... పిల్లల హక్కుల పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని, అవకాశమున్నచోట పిల్లలను వారివారి కుటుంబాలతోనే నివసించనివ్వాలి. వీలుకాని పక్షంలో... ప్రభుత్వాలే వారిని... పెంపకానికి ఇష్టపడే కుటుంబాల రక్షణలోనో లేదా సామాజిక ఇళ్లల్లో (Group Homes) నో ఉంచి, వారికి రక్షణ కల్పించాలి. ఈపాటికే కొన్ని ప్రభుత్వాలు ఇలాంటి చర్యలను ప్రయోగాత్మకంగా చేపట్టి విజయం సాధించాయి.

సంపదపరమైన లెక్కలన్నీ పక్కన పెడితే... పట్టణ ప్రయోజనాలు అని మనము వేటినైతే పిలుస్తున్నామో... అవన్నీ వృథా అని తేలిపోతుంది. కాబట్టి, సాంఘిక సంక్షేమ పథకాలను, నిర్ణాయక విధానాలను... పట్టణ ప్రాంతాల్లోని నిరుపేద, అట్టడుగువర్గాల పిల్లలకు వర్తించేలా రూపొందించాలి. అధునాతనమైన పట్టణాలు... సాధారణంగా పరిశుభ్రమైన నీటిని, ఆరోగ్యాన్ని, సామాజిక సేవలను, విద్యావకాశాలను అందజేస్తాయి. ఆ విధంగా, పట్టణ ప్రభుత్వాలు వారి పట్టణ పరిధిలో వారు... పిల్లలందరికీ సమానస్థాయి అవకాశాలు, సంఘటిత ప్రవేశ సౌలభ్యాలు కల్పిస్తే... పట్టణ జీవితం... వారు బ్రతికి బట్టకట్టేందుకు, సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు వీలవుతుంది.

– **హేన్రియేట్ హెచ్. ఫోర్** యునిసెఫ్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్

అనువాదం: **చింతకుంట్ల సంపత్ రెడ్డి**







# Raksha Bandhan



## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి
## రాఖీ కట్టిన
## ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు



Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur